పిచ్చివాడు వెంకయ్యేనని వూళ్ళో చాలామంది గుర్తుపట్టేరు.

ఆ రాత్రే చనిపోయిన రామయ్య బావకు వెంకయ్య బావ సంగతే తెలియదు.

రామయ్య చనిపోయిన తెల్లారే వారసులు వచ్చి అందినంతవరకు పుచ్చుకొని తలో కాస్తా పంచుకొని చక్కా పోయారు.

ఆ తర్వాత కొన్నాళ్ళకు వూళ్ళో వాళ్ళు చందాలు వేసుకొని వెంకయ్యకు సమాధి కట్టిస్తూ, దానిపక్కనే మిగిలిపోయిన సున్నం, ఇటుకతో రామయ్యకూడా ఓ సమాధి కట్టించారు. తను బ్రతికుండగా ఒరులను సుఖంగా బ్రతకనీకా, తాను సుఖపడకా బ్రతికిన రామయ్య లోభులు కట్టించిన ఆ సమాధిలోనైనా సుఖపడ్డాడో లేదో!

స్కెచ్

# మారనిలోకంలో మారే మనిషి

నిట్టల శ్రీరామమూర్తి

మెత్తని బూరుగుదూది తలగడలో తలనుగుచ్చి, కళ్ళల్లోపడే ముంగురులనైనా సర్దుకోకుండా ముఖమల్ పరుపుని అంటిపెట్టుకుని, కాళ్లూ చేతులూ ముడుచుకొని, శాలువ వెచ్చదనం అనుభవిస్తూ పడుకున్నాడు మధు. పసితనపు పాల పొంగుతో మిసమిసలాడే మీగడతరక మధు. అమాయకత్వం, అజ్ఞానం, ఐక్యంచెందిన ఆ ఎనిమిదేళ్ళ ప్రాయంలో ఆ చిట్టి బుర్రలో ఎన్ని ఊహాలు! ఆ సుకుమార హృదయంలో యెన్ని కదిలికలు! మృదువైన దిండుపై, అంతకంటే మృదువైన చెంపనుచేర్చి, దోమతెర చిల్లుల గుండా, కిటికీ ఊచల సందుల్లోంచి ఆకాశం కేసీ, అందులో మిన్కుమిన్కుమనే నక్షత్రాల కేసీ చూస్తూ పడుకున్నాడు. "ఎన్ని నక్షత్రాలో ఒకటి, రెండు, మూడు...అబ్బ, ఇంక లెక్క పెట్టలేను. ఎన్నున్నాయో. ఈ బుల్లిబుల్లిదీపాలు ఎంతదూరంలో ఉన్నాయో?" ఆ వయసులో ప్రపంచం, జీవితం అంటే మధుకి తెలిసినంత వరకూ మేష్టార్లూ, నేస్తాలూ, అమ్మచేసే అప్పచ్చులూ అనే. "ఈసారి లెక్కల్లో ఫస్టుమార్కు రావాలి. వెంకాయిగాడు ఒక్క మార్కులో తనని దాటేస్తున్నాడు. వీళ్ళందర్నీ ఓడించి తనే ఫస్టుగా ఉండాలి. అవునుగాని నర్సిగాడు మరీ ఇదమ్మా. ఉట్టి అబద్ధాలకోరు. ఏ ఆటలో చేర్చుకున్నా చిడింత్రాలు చేయటమే. గోళీకాయలు ఆడేనని నాన్నకి కోపంవచ్చింది. అందులో మజా ఆయనకేం తెలుసు. నాన్న మరి చిన్నప్పుడు గోళీలు ఆడలేదా? అమ్మ అప్పచ్చులు చేస్తానంది రేపు. ఎంచక్కా చేగోణీలూ, జంతికలూ జేబులో పోసుకుని ఒక్కొక్కటే తింటూ అందరినీ ఊరిస్తాను. అబ్బ నోరూరుతోంది..." మధు పడుకున్నాడు, లేతమెదడులో చిట్టి ఊహాలు నిర్మించుకుంటూ. నక్షత్రాలు మిన్కుమిన్కుమంటున్నాయి అమాయకంగా సానుభూతితో. రాత్రంతా చేగోడీలు తిన్నట్టు కలలే. నర్సిగాడు ఇంకా కాస్త పెట్టమని బతిమాలుతున్నాడు. ఆకాశం నిండా చేగోడీలే...

పదేళ్ళ తర్వాత—

దోమతెర చిల్లులగుండా కిటికీఊచల సందుల్లోంచి ఆకాశాన్నీ నక్షత్రాల్నీ చూస్తున్నాడు మధు. "లలిత లేకపోతే క్లాసులో ఏంతోచదు. అస్తమానం ఆమె కేసి చూడాలనీ, ఆమెతో మాట్లాడాలనీ ఉంటుంది. తీరా మాట్లాడితే ఆమెకేం కోపంవస్తుందో! ప్రిన్సిపాలుకి రిపోర్టు చేస్తుందేమో! రేపు నోటుబుక్ అడుగుతాను. ఏమంటుందో చూద్దాం. అయితే ఇంతకీ రేపు ఏం డ్రెస్ వెయ్యను? ట్వీడ్ వేస్తే లలితకి నచ్చుతుందా. లాల్చీ వెయ్యనా? ఈసారి ఫుట్ బాల్ మాచ్ కి కాలేజీ గరల్స్ అంతా వస్తారు. తన ఆట గొప్పతనం ఆనాడు చూపించాలి..." స్టంటు పిక్చర్లూ, కత్తియుద్ధాలూ, బాక్సింగూ అంటే మధుకి సరదా. సెకండ్ షో సినిమాలూ, నాటకాలూ, తీర్థాలూ, సంబరాలూ, కొండగుట్టలు ఎక్కడం, సముద్రంపై బోటుషికార్లూ చాలా సరదా మధుకి. సినీ హీరోలా ఉండాలనుకుంటాడు లలిత సమక్షంలో. రాజకీయాల్లో ముం

దడుగు. పెద్ద సీపీకరుగా, సంస్కారిగా అయిపోవాలని ఆదుర్దా. సోషలిస్టు నాయకుల బొమ్మలూ, సినిమాతారల ఫొటోలూ మధు ఆరాధనా దేవతలు. ఇదే అర్థం ప్రపంచం అంటే మధు దృష్టిలో.

ఈ సరదాలుచూసి మందలించేనాన్ననీ, ఆ వయస్సు యితర జనాన్నీచూసి వాళ్లు అంత సీరియస్‌గా ఎందుకుంటారో అర్థంకాదు మధుకి. వాళ్లకీ అభిరుచులూ, ఈ సౌఖ్యాలు లేవుగదా దురదృష్టవంతులు అని జాలిపడతాడు. భావపూరితమైన తీయనిసంగీతంలో ఉల్లాసంకలిగించే సినిమా, దీన్ని చూడాలనే ఆసక్తిలేకుండా ఇంటి వద్ద ఊరికే కాలంగడిపేనాన్ననుచూసి తండ్రికి చూసే అదృష్టంలేదని విచారిస్తాడు మధు.

ఆకాశం గ్రౌండులోని నక్షత్రాలన్నీ ఫుట్‌బాల్స్‌గా ఊహించుకుంటూ నిద్రపోయాడు మధు. నక్షత్రాలు కుర్రతనపు కొంటెతనంతో మిణుక్కు మిణుక్కు మంటున్నాయి. నక్షత్ర మండలాలుఒక్కొక్కదానిపై గెంతుకుంటూ లలితా తనూ చెట్టాపట్టా వేసుకొని పోతూన్నట్లు కలలు.

ఇంకో పదేళ్లకి అవే నక్షత్రాలు, అదే ఆకాశం అదే దోమ తెరమంచం, ఆకాశంకేసిచూస్తూ పడుకున్నాడు మధు. శాలువ వెచ్చతనం చాలటం లేదు. రేడియోలోంచి శ్రావ్యంగా, మనోహరంగా ఓ గీతం వినవస్తోంది. బెడ్‌రూము బ్లూలైటు ఉద్రేకాన్ని రెచ్చగొడుతోంది. ప్రక్కింట్లో వున్న శ్యామలనీ, పెదవి పెదవీకలిపి, వెచ్చని మెత్తని దేహాల్ని ఏకంచేసి, మనస్సులు కరిగిపోతూంటే శ్యామలతో తను గడిపిన మధురక్షణాలను మననం చేసుకుంటున్నాడు. అర్థంలేని ఆవేశాల్తో, వాస్తవికతనెరుగని ఆశయాల్తో, ఆదర్శాల్తో తను గడిపిన స్టూడెంటు జీవితం తలుచుకుంటూంటే సిగ్గు వేస్తోంది. సినీహీరోలా ఉండాలనే తన ప్రయత్నాలూ, ఉద్రేకపు రాజకీయాలూ, స్టంటుపిక్చర్లపై మోజూ, లలిత అంటేఅంత "ఇద్దై"పోవటం, నిద్రమానుకుని రెండో ఆటసినిమాలకి పనిగాపెట్టుకొని వెళ్ళటం, సంబరాల్లో పైలాపచ్చీసుగా తిరగటం ఇవన్నీ ఇప్పుడు హాస్యాస్పదంగా కనిపిస్తున్నాయి మధుకి. ఇప్పుడు రాత్రిళ్లు సినిమాల్లో, హోటల్లో, గడపాలనిలేదు. రోడ్డుమీద ఆడది కనిపిస్తే తను అంతగా వెర్రెక్కిపోటంలేదు. అడ్డులేని, నిరంతరోల్లాసపూరితమైన విచ్చలవిడి లాడ్జీల జీవితంవైపు మనస్సు పోవటంలేదు. సుఖమారం అలవాటైంది. భార్యఅనే ప్రణయనీస్వరూపం ఆ విలాసాలస్థానం ఆక్రమించింది. ఆఫీసు పని పూర్తికాగానే యింటికివెళ్లాలనీ, శ్యామలతోనే గడపాలనీ అనిపిస్తోంది. జీవితసమస్యల్ని అర్థంచేసుంటూ, వాస్తవికతను అనుసరిస్తూ, అర్థాంగితోడుగా జీవితం గడపాలనే సత్యాన్ని గుర్తించేడు. ఆదర్శాల్ని వదలి నిత్యజీవితంలో తగిలే దెబ్బలని ఓర్చుకుంటూ, కష్టసమయాల్లో శ్యామల చిరునవ్వేసహాయంగా, సక్రమపంథాలో జీవితంగడపాలని గ్రహించేడు. తన స్టూడెంటు జీవితంలో, తండ్రీ ఆతని తోటివాళ్లూ తన సౌఖ్యాన్ని గ్రహించలేకపోయారనీ, అనుభవించలేకపోయారనీ జాలిపడేవాడు. ఇప్పుడు వాళ్ళ మనస్తత్వము, తనికి అర్థమవుతోంది. తనూ ఇప్పుడు వాళ్ళలాగే ఉన్నాడు.

తన స్టూడెంటు జీవితం ఓ నదీప్రవాహపు జన్మస్థానం లాంటిది. రాళ్ళూ, రప్పలూ కొండలూ, వాగులూ దూసుకుపోతూ ఓ దారీ తెన్నూలేక విచ్చలవిడిగా, అందినదోవని అల్లుకుపోయే స్వేచ్ఛా నదీజలం—ఆ రోజుల్లో. నేడు క్రమపద్ధతిలో రెండువైపులా గట్టులకు లోబడి సాఫీగా నిర్మలంగా నిశ్చలంగా ప్రవహించే నదీప్రవాహం తనుఇప్పుడు. బయట ఆఫీసు. ఇంట్లో శ్యామలా. ఇదే ప్రపంచం అంటే అర్థం మధు మట్టుకి. నిద్రపోయాడు మధు. నక్షత్రాలు చిలిపిగా మిణుక్కుమంటున్నాయి—మంతనాలాడే మగువల్లాగ.

మరి పదేళ్ళకి అవే నక్షత్రాలు—అదే ఆకాశము. మధు ఆలోచిస్తూ పడుకున్నాడు. యౌవనోత్సాహంతో ప్రేమమయి శ్యామలతో ఆనందించే రోజులు పోయాయి. ఇప్పుడు ఆశయాలు లేవు, సరదాలుపోయి సమస్యలు మీదపడ్డాయి. తనకిప్పుడెక్కడికీ వెళ్ళాలనిలేదు. ఏదీ అనుభవించాలనిలేదు. తన శక్తినీ టైమునీ జీవితపోషణాభారం లాగేస్తోంది. పిల్లలకి పెళ్ళిళ్ళు చేయాలి. రెండోవాడు ఇంటరు మూడోసారి తప్పేడు. ఆఖరుదానికి నీరసం మందు యిప్పించాలి. డబ్బు సంపాదించాలి. అదే తనజీవితం. ప్రపంచం అంటే తనమట్టుకు అదే. టిఫిన్ తిన

నసీ, సినీమాకేనా వెళ్ళననీ కుర్రవాళ్లు అనుకుంటున్నారు. తనూ తనతండ్రి విషయంలో వాళ్లలా అనుకునేవాడే. తన వయస్సు వచ్చేసరికి వాళ్లూ అంతేనేమో. ఎప్పటికీ మారని తనకాలేజీ ఆవరణలో ప్రవేశిస్తూంటే తన స్టూడెంటు జీవితం, బాధ్యత నెరుగని ఖుషీ జీవితం. తలచుకుంటూ వుంటే కలిగేనిరుత్సాహం నిర్లిప్తత...మధునిద్ర పోయాడు. నక్షత్రాలు తెల్లమొహాలేస్తున్నాయి.

మధు పెన్షన్ పుచ్చుకున్నాడు. అదే ఆకాశము అవే నక్షత్రాలు తన జీవితం నిండు ప్రవాహము. ప్రశాంతం. ఎగుడుదిగుడులులేవు. సంపూర్ణమైన సంతృప్తి. తనింక చేయాల్సిందేమీలేదు. కోరికలూలేవు. కుర్రాళ్ళు ఉద్యోగాల్లోఉన్నారు పిల్లలు పెళ్ళిళ్లయి కాపరాలు చేస్తున్నారు. తనూ తన న్యూస్ పేపరూ, శ్యామలవ్వతో ముచ్చట్లు, మనమల్ని ఆడించటం. ఇప్పుడుమధుకి ప్రపంచం అంటేఇదే. లోకంలోని అన్నివిషయాలుకావాలి తనకు. రాజకీయాలూ. నాయకులూ, దేశదేశాలలో జరిగే వింతలూ విశేషాలూ, దేశం భావితీరూ, దేశసమస్యలూ సర్వం తన దృక్పథంలో ఇమడవలసిందే. నిమిషానికో ఫాషన్ మార్చే కుర్రకారునిచూసి నవ్వుకునేవాడు. తనూ ఆదశలో అన్ని వేషాలూ వేసినవాడే.

తేలిక హృదయంతో శూన్యంలోకి చూస్తూ నిద్రపోయాడు మధు: నక్షత్రాలు నవ్వుకున్నాయి.

మరో పదేళ్ళకి...

అదే ఆకాశం అవే నక్షత్రాలు. దోమతెర చిల్లుల్లోంచి చూస్తూ పడుకున్నాడు మధు. రగ్గు కప్పుకున్నాడు. మధ్యమధ్య దగ్గుతున్నాడు. శరీరం శుష్కించుతోంది. ఇప్పుడు ఇదివరకులాగ ఏది తిన్నా పడటంలేదు. పేపరు చూడ్డానికికూడా ఓపికలేదు. ఊరికే కూర్చుంటేనే, ఆకాశంలోనే, ఆ ఏకాంతంలోనే, ఆస్వాలోచనలోనే ఆనందం. గంటలు క్షణాలుగా వెళ్లిపోతూంటాయి. తను రెపరెపలాడే యౌవనంలో ఉన్నప్పుడు అనుకునేవాడు ఈ ముసలాళ్లు ఊరికే ఏపనీలేకుండా ఎల్లా ఉండగలిగేవారా అని. ఇప్పుడు ఈ స్థితిలో తనకే తెలియవస్తోంది. ఏదశలో అనుభవించే వారికి ఆ దశలో ఆనందం ఉంటుందనీ ఈసత్యం తెలుసుకోలేక ఒక దశలోవాడు ఇంకోదశలో వారినిచూసి విచారించడంగాని జాలిపడడంగాని జరుగుతుందనీ. యౌవనంలో జీవితంలో ప్రతిక్షణం మధురప్రాయమే. ఇప్పుడు ఈ అనారోగ్య దశలో ఈ కృశించిన శరీరంతో జీవితం గడపాలంటేనే కష్టం. ఇప్పుడు చావంటే భయంలేదు. ఆ ఆఖరు అనుభవంకోసమే ఎదురుచూపు. కాని ఈ స్థిరత్వం క్షణికంగా అనుపిస్తోంది. ఆలోచనలతో మధుకి నిద్రపట్టలేదు. ఎప్పటికీ మారని ఆ ఆకాశం ఆ నక్షత్రాలు చూస్తుంటే వివిధ దశలలోని తన జీవిత పరిణామం జ్ఞప్తికివస్తోంది. తను చిన్నప్పుడు బీచిలో సముద్రంలోకి వెళ్ళి ఆడుకోటం, కెరటం మీదికివస్తూంటే వెనక్కి పారిపోటం, మళ్ళీ ఉబలాటంగా తన ముందుకు పోవటం, కెరటం తన బట్టలు తీసివేస్తూంటే భయంతోకూడిన నవ్వులూ, కేకలూ, తీసి యిసుక ముద్దలుచేసి మినసున్నంటూ తన స్నేహితులతో ఆడిన ఆటలూ, ఇసుకతోకట్టిన పిచికగూళ్ళూ, తారుణ్యంలో శ్యామలా తనూ బీచిఒడ్డునే కూర్చుని తీరాన్ని గట్టిగా అదిమి కౌగిలించుకొని ఎగబ్రాకే కెరటంఆవేశంతోచూస్తూ, కెరటాలపై గెంతుకుంటూ ఆకాశం సముద్రం అంటిపెట్టుకుపొయ్యే దిగంతాలకి పరుగెత్తే ఆలోచనలతో తాము గడిపిన క్షణాలూ, తోటిమునిసిలివాళ్ళతో బీచిలో తను ప్రతిసాయంత్రం జరిపిన రాజకీయ సమావేశాలూ-అన్నీ జ్ఞాపకానికి వస్తున్నాయి. మళ్ళీ రాని సౌఖ్యం, మళ్ళింపలేనిరోగం, మనస్సులో బరువైన బాధా ఎదురులేని కాలనియంత క్రౌర్యం, తన నిస్సహాయతా; మధుకి నిద్రరావటంలేదు. అస్థిరమైన క్షణికమైన తన జీవితం, నిరంతరకాంతితో శాశ్వతంగా మిన్కుమనే నక్షత్రాలూ, అంతులేని అపారమైన శూన్యం...ఏమిటీ అనుబంధం?

నక్షత్రాలు మిన్కుమంటూ ప్రశ్నార్థకంగా చూస్తున్నాయి.

మరికొన్నాళ్ళకి—అవే నక్షత్రాలు అమాయికంగా మిన్కుమిన్కు మంటూ ప్రశ్నిస్తూనే వున్నాయి. అదే ఆకాశం, గంభీరమైన అనంతమైన శూన్యం! కిటికీ ఊచలు. దోమతెర గాలికి ఊగిసలాడుతోంది. బ్లూలైటు వెలుగుతోంది. మెత్తనిపరుపూ, మెత్తనితలగడ. మధు మాత్రం లేదు.